గాల్లో తిరుగుతూ గాలి మాటలు చెప్తున్న సీఎం, మంత్రులు

- నాడు అభివృద్ధిలో నంబర్ వన్.. నేడు అవినీతిలో మొదటి స్థానం
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

నేరేడుచర్ల, ఏప్రిల్ 4: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు గాల్లో తిరుగుతూ గాలి మాటలు చెప్తూ పబ్బం గడుపుతున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని మేడారం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం, మంత్రులు తమ స్వార్థం కోసం, ధనార్జనే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారు తప్ప ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి చూపించడం లేదని మండిపడ్డారు. పోలీసులను అడ్డం పెట్టుకొని పాలన సాగిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వివాదంతో దేశంలో రాష్ట్రానికి చెడ్డపేరు వచ్చిందని విచారం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో పచ్చదనాన్ని 7.50 శాతం పెంచారని, నేడు కాంగ్రెస్ పాలనలో ఒక్క రోజులోనే 100 ఎకరాల్లో చెట్లను నరికివేసి పర్యావరణాన్ని దెబ్బతీసి చరిత్ర సృష్టించారని ఎద్దేవా చేశారు. కోట్లాది విలువైన భూములను బంధుమిత్రులు, కుటుంబ సభ్యులకు అంటగట్టేందుకే రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం యాసంగి వరి కోతలు ప్రారంభమైనా ప్రభుత్వం ఒక్క ధాన్యం కొనుగోలు కేంద్రం కూడా ప్రారంభించలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎంత ధాన్యం కొనుగోలు చేశారు.. రైతులకు ఎంత నగదు చెల్లించారనే వివరాలను వెల్లడించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సవాలు విసిరారు. రైతుబంధు, రుణమాఫీ, బోనస్‌పై మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సరైన సమాధానాలు చెప్పడం లేదన్నారు. నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్ రెడ్డి సొంత జిల్లాలోనే వేల ఎకరాల పంట ఎండిపోయి రైతులు అరిగోసపడ్డారని, అయినా పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. సంపాదనలో ముఖ్యమంత్రి, మంత్రులు పోటీ పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని, అందుకే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు వెనుకడుగు వేస్తుందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే నంబర్ వన్‌గా ఉంటే నేడు అవినీతిలో మొదటి స్థానంలో ఉందని విమర్శించారు. సమావేశంలో మారి పెద్ది శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, మాజీ జడ్పీటీసీలు అన్నపురెడ్డి నారాయణరెడ్డి, కొప్పుల సైదిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ చెన్నబోయిన సైదులు, మున్సిపల్ మాజీ చైర్మన్ చందమల్ల జయబాబు, నెమ్మాది భిక్షం, బీఆర్ఎస్ మండల, పట్టణ కార్యదర్శులు యల్లబోయిన లింగయ్య, చిత్తలూరి సైదులు, మాజీ సర్పంచులు శ్రీహరి, పల్లెపంగ నాగరాజు, అనంతు శ్రీనివాస్ గౌడ్, నాయకులు రాపోలు నవీన్, వస్కూల సుదర్శన్, శ్రీను, గురవయ్య, మల్లారెడ్డి, నరసయ్య, రవీందర్, భాస్కర్, నాగార్జున, శంకర్, రాములు, ఉస్మాన్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల పండుగలో మాజీ మంత్రి..

సూర్యాపేట రూరల్: సూర్యాపేట పట్టణ పరిధిలోని గాంధీనగర్‌లో నిర్వహించిన ఎల్లమ్మ తల్లి బోనాల పండుగలో జగదీశ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ 13వ వార్డు అధ్యక్షుడు ఎస్‌కే.రఫీ, బానోతు జానునాయక్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

- ఆ పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య


సమావేశంలో మాట్లాడుతున్న తాటికొండ సీతయ్య

తుంగతుర్తి, ఏప్రిల్ 4: వరంగల్‌లో ఏప్రిల్ 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య పిలుపునిచ్చారు. మండల పరిధిలోని అన్నారం గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుండగాని రాములుగౌడ్, దొంగరి శ్రీనివాస్, కడారి దేవదాసు, పల్లరాములు, మిట్టగడుపుల సతీశ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

- బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రవినాయక్

పాలకవీడు, ఏప్రిల్ 4: ప్రభుత్వం తక్షణమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి భూక్యా రవినాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు రైస్ మిల్లులను ఆశ్రయిస్తున్నారని, దీంతో యాజమాన్యాలు సిండికేట్‌గా మారి రైతులను దోచుకుంటున్నాయని పేర్కొన్నారు. సన్న ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువగా చెల్లిస్తున్నారని వివరించారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటరెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసేందుకే 'టాలెంటోత్సవ్'

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 4: విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసేందుకే సిటీ టాలెంట్ హైస్కూల్‌లో టాలెంటోత్సవ్ నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఆర్.ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని సిటీ టాలెంట్ హైస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన టాలెంటోత్సవ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నాటికలు, డ్యాన్స్‌లు, మిమిక్రీ వంటివి ప్రదర్శించి విద్యార్థులు ప్రతిభ చాటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటీ టాలెంట్ హైస్కూల్ ప్రిన్సిపాల్ మురళీధర్‌తో పాటు సిటీ ఎలైట్ పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్, న్యూ విజన్ స్కూల్ ప్రిన్సిపాల్ సుకృతరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS
WANTED
★ Wanted Sales Executives @ Miryalaguda,
Unic Chem Technologies to make Best Future in Water Treatment Plants & Chemicals.
Ph: 9573244611, raju@unicchem.com
NT-330933
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | రామన్నపేట: 9182777638

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

- ఎస్పీ నరసింహ

అర్వపల్లి పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

అర్వపల్లి, ఏప్రిల్ 4: ఇసుక అక్రమ రవాణా జరుగకుండా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేయాలని ఎస్పీ నరసింహ ఆదేశించారు. అర్వపల్లి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించిన ఆయన స్టేషన్ పరిసరాలు, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ రికార్డులను, కేసుల స్థితిగతులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది బాధ్యతగా పనిచేస్తూ మండల పరిధిలో పెట్రోలింగ్ పెంచాలని, డయల్ 100 కాల్స్‌పై వేగంగా స్పందించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని ఇసుక అక్రమ రవాణా జరుగకుండా అరికట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పార్థసారథి, నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ బాలకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

తుంగతుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ నరసింహ, డీఎస్పీ పార్థసారథి సందర్శించారు. నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ భవనంలో గదులను పరిశీలించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఎస్ఐ క్రాంతికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ భిక్షపతి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ భిక్షపతి తదితరులు

నేరేడుచర్ల, ఏప్రిల్ 4: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ పి. భిక్షపతి అన్నారు. డ్రగ్స్ అనర్థాలపై అవగాహనకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం పట్టణంలోని స్పందన జూనియర్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 16న యాంటీ నార్కోటిక్స్ డే సందర్భంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. డ్రగ్స్‌పై పోరాటానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జూన్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కళాశాలల్లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే ప్రతి విద్యార్థికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కట్ట ప్రవీణ్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఎడవల్లి వెంకటరెడ్డి, పోలీస్ సిబ్బంది స్వామి పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం : డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడ, ఏప్రిల్ 4: వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వర్ణభారతి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. కోదాడలోని రంగా థియేటర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, ట్రస్ట్ సభ్యులతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పైడిమర్రి సత్తిబాబు, కిట్స్ మహిళా కళాశాల చైర్మన్ నీల సత్యనారాయణ, ట్రస్ట్ బాధ్యులు చారుగండ్ల రాజశేఖర్, ఓరుగంటి కిట్టు, యాదా సుధాకర్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వేంపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి'

హుజూర్‌నగర్‌లో విధులను బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

హుజూర్‌నగర్, ఏప్రిల్ 4: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని పలువురు న్యాయవాదులు డిమాండ్ చేశారు. గోదావరిఖనిలో న్యాయవాది నూతి సురేశ్‌పై జరిగిన దాడికి నిరసనగా శుక్రవారం హుజూర్‌నగర్ న్యాయస్థానంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఇటీవల న్యాయవాదులపై భౌతిక దాడులు అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్య, న్యాయ వ్యవస్థకు గొడ్డలి పెట్టు వంటిదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం వెంటనే న్యాయవాది పైన దాడికి పాల్పడిన దుండుగులపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, నాగేశ్వర్‌రావు, ప్రదీప్తి, శ్రీలక్ష్మి, శృతి, బాలకృష్ణ, శ్రీనివాసరావు, యాదగిరి, శ్రీను నాయక్, నాగూర్ పాష, శివ పాల్గొన్నారు.

తుంగతుర్తిలో..

తుంగతుర్తి: గోదావరిఖనిలో న్యాయవాదిపై జరిగిన దాడికి నిరసనగా తుంగతుర్తి కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తుంగతుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనపర్తి జ్ఞానసుందర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'మై హోం' ప్రోత్సాహకం

విద్యార్థులతో మై హోం పరిశ్రమ అధికారులు

మేళ్లచెర్వు, ఏప్రిల్ 4: స్థానిక మై హోం సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 39 మంది విద్యార్థులకు రూ. 2.34 లక్షల ప్రోత్సాహక నగదును శుక్రవారం పంపిణీ చేసింది. మేళ్లచెర్వు, చింతలపాలెం, మఠంపల్లి, కోదాడ మండలాలకు చెందిన 10 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు 3 కస్తూర్బా పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన ప్రతిభ గల 39 మంది విద్యార్థులకు ప్రథమ రూ.8 వేలు, ద్వితీయ రూ.6 వేలు, తృతీయ రూ.4 వేల చొప్పున నగదు ప్రోత్సాహకంతో పాటు సర్టిఫికెట్లను పరిశ్రమ ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు పదేళ్లుగా పరిశ్రమ యాజమాన్యం ఈ అవార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. సీనియర్ జీఎం నాగేశ్వర్‌రావు, జీఎం శ్రీరామ్, ఏజీఎం శ్రీనివాస్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలి

నిరసన వ్యక్తం చేస్తున్న మాస్‌లైన్ నాయకులు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 4: అటవీ, ఖనిజ సంపదను బహుళ జాతి కంపెనీలకు దోచిపెట్టడమే కేంద్ర ప్రభుత్వ ఆపరేషన్ కగార్ లక్ష్యమని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు మానసాని చంద్రకళ, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేర్ల నాగయ్య పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో..

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.కోటేశ్వర్‌రావు, టీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మార్జున్, సీయూసీ నాయకుడు కరీం డిమాండ్ చేశారు. స్థానిక చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు.

నాగారం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

నాగారం, ఏప్రిల్ 4: నాగారం పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ పార్థసారథి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ ఎం.ఐలయ్య, సిబ్బంది ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 4: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్షతో పాటు జరిమాన విధిస్తూ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బి.వి.రమణ తీర్పు చెప్పారు. గురువారం సూర్యాపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం ఆధ్వర్యంలో సిబ్బంది డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుగురు వ్యక్తులు పట్టుబడగా వారిని శుక్రవారం ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బి.వి.రమణ ఎదుట హాజరు పరిచారు. న్యాయమూర్తి ఒకరికి ఒకరోజు జైలు శిక్షతో పాటు రూ.1500 జరిమాన విధించగా, మిగిలిన వారికి జరిమానాలు విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ఎంతటి వారికైనా శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు.

రైతులు ఆందోళన చెందొద్దు

- తాడువాయి పీఏసీఎస్ చైర్మన్ తొగరు రమేశ్

మునుగాల, ఏప్రిల్ 4: మండల పరిధిలోని తాడువాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంపై వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో సొసైటీ చైర్మన్ తొగరు రమేశ్ స్పందించారు. శుక్రవారం తాడువాయి సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొసైటీ పరిధిలోని 13 గ్రామాల రైతులు ఎటువంటి ఆందోళన చెందొద్దని సూచించారు. సొసైటీలో పని చేస్తున్న కింది స్థాయి సిబ్బంది రైతులు చెల్లించిన రుణాల డబ్బును కొంత వాడుకున్నారని, వాడుకున్న డబ్బును తిరిగి వారితోనే కట్టిస్తామని పేర్కొన్నారు. సొసైటీలో స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు తీసుకొని తిరిగి చెల్లించిన వారు రసీదులను తీసుకొచ్చి ఒకసారి డబ్బులు జమయ్యాయా లేదా అనే విషయాన్ని సరి చూసుకోవాలని చెప్పారు. రూ.3 కోట్ల టర్నోవర్‌తో ఉన్న తాడువాయి సొసైటీని తాను చైర్మన్ అయ్యాక రూ.20 కోట్ల టర్నోవర్‌కు పెంచానని, తాను ఎటువంటి అవినీతికి పాల్పడలేదని, తప్పుడు ప్రచారాలు మానుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పైప్‌లైన్ ఏర్పాటు అభినందనీయం : డీఈ

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 4: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని వస్రాంతండాలో సువెన్ ఫార్మా కంపెనీ సహకారంతో మిషన్ భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ డీఈ సత్యారావు అన్నారు. తండావాసులకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఏర్పాటు చేసిన నూతన పైప్‌లైన్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సువెన్ ఫార్మా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రమేశ్‌బాబు, మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ ఎస్.ఎస్.ఆర్.ప్రసాద్, హెచ్ఆర్ వెంకటరమణ, సైదులు, జీవన్, కృష్ణ, తండావాసులు ధరావత్ సైదానాయక్, చక్రునాయక్, శివరాం, సేవ్యానాయక్, తారాసింగ్, రమేశ్, అశోక్, నగేశ్, తరుణ్ పాల్గొన్నారు.

ప్రజలను ఏకం చేసేందుకే 'ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్'

పెన్‌పహాడ్, ఏప్రిల్ 4: దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రజలను ఏకతాటిపై తీసుకొచ్చే కార్యక్రమమే 'ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్' అని మండల విద్యాధికారి నకిరెకంటి రవి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వివిధ రాష్ట్రాల్లోని సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఆహార నియమాలు తదితర విషయాలు తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ విభిన్న సంస్కృతులను చిత్రాల ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆనంద భాస్కర్, సైదులు, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ బకాయిలు పూర్తి చేస్తేనే ధాన్యం కేటాయింపు

- అదనపు కలెక్టర్ రాంబాబు

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూర్యాపేట, ఏప్రిల్ 4: సీఎంఆర్ బకాయిలు పూర్తి చేసిన మిల్లర్లకే 2024-25 రబీ సీజన్ ధాన్యం కేటాయించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ రాంబాబు తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సివిల్ సప్లయి అధికారులు, మిల్లర్లతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022-23 రబీ సీజన్, 2024-25 ఖరీఫ్ సీజన్ సీఎంఆర్ బకాయిలను త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. వచ్చే ఖరీఫ్ ధాన్యం బ్యాంక్ గ్యారెంటీ ఉన్న మిల్లులకు మాత్రమే ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వేలం వేసిన ధాన్యం బకాయిలు సైతం త్వరగా చెల్లించాలని ఆదేశించారు. మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్ఓ రాజేశ్వరరావు, సివిల్ సప్లయి డీఎం ప్రసాద్, ఏఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి, డీటీలు, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

వాన గుబులు.. ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు

- ఆందోళనలో రైతులు

ఉండ్రుగొండలో ధాన్యం రాపులు

చివ్వెంల, ఏప్రిల్ 4: రైతులు ఆరుగాలం శ్రమించి సాగు చేసినప్పటికీ కాల్వల కింద సరైన సమయంలో నీరందక పంటలు ఎండిపోయాయి. అక్కడక్కడా బోర్ల కింద నీటి సౌకర్యం ఉన్న చోట చేతికందిన పంటను కోసి అమ్ముకుందామంటే కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. ఇప్పటికే పలు గ్రామాల్లో పంటను కోసి కల్లాలకు తరలించడంతో పాటు రహదారుల వెంట కూడా ఆరబెట్టారు. ఇదిలా ఉండగా రైతును పగబట్టిన విధంగా అకాల వర్షాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. వాతావరణంలో రోజురోజుకూ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మధ్యాహ్నం వరకు ఎండలు కొడుతూనే సాయంత్రానికి చల్లబడి గాలి దుమారంతో కూడిన వర్షం వస్తుండడంతో రైతులు ఏం చేయలేని పరిస్థితి నెలకొంది. మండలంలో ఇప్పటికే వరి కోతలు మొదలయ్యాయి. పలు గ్రామాల్లో గతంలో నిర్వహించిన కొనుగోలు కేంద్రాల స్థలాల్లో ధాన్యం ఆరబెట్టుకున్నారు. కాగా, ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండిన అరకొర పంటనైనా అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనాలని కోరుతున్నారు.

'రైతులు సాంకేతికతను వినియోగించుకోవాలి'

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

గరిడేపల్లి, ఏప్రిల్ 4: పంటల సాగులో రైతులు నూతన సాంకేతికతను వినియోగించుకోవాలని గడ్డిపల్లి కేవీకే ఇన్‌చార్జి ప్రోగ్రాం కోఆర్డినే